

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - ***రచయిత్రి(బెంగుళూరు)***

# (అ)జ్ఞానప్రసూనం

**"అమ్మా! దీన్ని చూడవే.. ఏమంటోందో? "** మూల గదిలోంచి గట్టిగా కేక పెట్టింది భవాని.

"మళ్ళీ ఏమొచ్చిందర్రా? ఇప్పుడే కదా మరమరాలు పట్టుకుని ఆడుకుంటానని వెళ్ళారు" అని అడిగింది వాళ్ళమ్మ సత్యవతి వంటింటిలోంచే.

"ఆకలి వేస్తోంది. కడుపులో ఎలకలు పరిగెడుతున్నాయి అంటే నీ మొహం! ఎలకలు అటకమీద పరిగెడతాయి , కడుపులో ఎక్కడైన పరిగెడతాయా? అంటోంది.. " అని భవాని నవ్వడం మొదలు పెట్టింది.

"అదా! ఇంకా నేనేవిటో అనుకున్నాను.... అది చిన్నపిల్ల, దానితో నీకేవిటి?.. ఊరుకో "అంది సత్యవతి.

"అదొక్కటే కాదు. అన్నీ ఇలాంటివే చేస్తుంది.. దీనికి బొత్తిగా తెలివి లేదు.. "అని చెల్లెల్ని చూసి మళ్ళీ నవ్వడం మొదలు పెట్టింది పన్నెండేళ్ళ భవాని.

తొమ్మిదేళ్ళ ప్రసూన మాత్రం "దీనికే ఏదో పెద్ద తెలివి ఉన్నట్టు? మాట అంటే సరిగ్గా అనాలి. కడుపులో ఎలకలూ, కోతులూ ఏమిటి.. " అని ఎదురు అడిగింది.

"బాగా ఆకలేస్తే అలా అంటారు ప్రసూనం.. అంతే కానీ నిజంగా ఎలకలూ, కుందేళ్ళూ కడుపులో గెంతుతాయని కాదు. అయినా నువ్వింత అమాయకురాలివేమిటే? " అని నవ్వింది సత్యవతి.

"నేనేమీ అమాయకురాలిని కాదు. నాన్ననడుగు చెప్తారు నేనెంత తెలివైనదాన్నో "అంది గడుసుగా.

తెల్లగా చిన్నగా బొమ్మలా ఉంటుంది ప్రసూన. విజయవాడ దుర్గమ్మని చూసి వచ్చిన తర్వాత పుట్టిందని పెద్దమ్మాయికి దుర్గాభవాని అని కాళహస్తి వెళ్ళి వచ్చిన తర్వాత పుట్టిన రెండోపిల్లకి జ్ఞానప్రసూన అని పేరు పెట్టుకున్నారు.

ఇద్దరిలోనూ భవాని చాలా తెలివైనది. చురుకైనది.. ఏది చెప్పినా తొందరగా తెలుసుకుని నేర్చుకుంటుంది. ప్రసూన చాలా అమాయకురాలు.. ఎవరేం చెప్పినా నిజమని అనుకుంటుంది. తన పనేదో తన లోకమేదో అన్నట్టుగా ఉంటుంది. ఎక్కువగా మాట్లాడదు.. కానీ మొదలు పెడితే ఆ పదు. కోపం వస్తే మాత్రం మూతి బిగించుకుని కూర్చుంటుంది. ఎందుకు కోపం వచ్చిందో? ఎప్పుడు తగ్గుతుందో తెలీదు.

' ఇంత అమాయకురాలు.. ఎలా బ్రతుకుతుందో ?ఏవిటో ? ' అని వాళ్ళమ్మ సత్యవతమ్మకి ఎప్పుడూ దిగులే.

" తెల్లని వన్నీ పాలు, నల్లని వన్నీ నీళ్ళు అనుకుంటుంది ఎలాగండీ దీనితో? పన్నెండేళ్ళు వెళ్ళాయి" అని దిగులు పడింది భర్తతో.

ఎప్పుడు విందో..

" అమ్మా! నేనేం అలా అనుక్కోను.. నాన్న సరయ్యా దగ్గర కొనుక్కునే కేమిల్ సిరా నల్లగా ఉంటుంది.. మన గుండు గిన్నెలో నువ్వు తోడేసే పెరుగు కూడా తెల్లగా ఉంటుంది.. అంటే దీనర్థం నాకు పాలు కాకుండా ఇంకా ఏమేమి తెల్లగా ఉంటాయో, నీళ్ళు కాకుండా నల్లగా ఉండేవేమిటో తెలుసనే కదా నీకే ఏమీ తెలీదు " అని తననే విసుక్కుంటుంటే.. భర్త వైపు అయోమయంగా చూస్తూ,

" చూసారా! ఇదీ వరస.. పేరుకే జ్ఞాన ప్రసూన.. నిజానికి ఉత్త అజ్ఞాన ప్రసూన "ఇది అంది భారంగా నిట్టూరుస్తూ..

ప్రతీ ఏడూ వేసవి సెలవుల్లో తాతగారి ఊరు వెళతారు ప్రసూనా, భవానీ. ఆ సంవత్సరమూ అలాగే వెళ్ళి నాలుగురోజులుండి రమ్మని ఇద్దరినీ పొరుగునే ఉన్న సత్యవతమ్మ అమ్మా నాన్నల ఇంటికి నాలుగు రోజులుండి రమ్మని పంపారు తమ గుర్రం బండిలో.

సత్యవతమ్మ నాన్నగారు ఊరికి పెద్ద, వారిల్లు చాలా పెద్దది..

ఆవిడ అన్న దమ్ములూ, వారి పిల్లలూ, వచ్చే పోయేవాళ్ళతో చాలా సందడిగా ఉంటుంది. ఇక్కడ పిల్లలు లేకపోతే తోచదని నాలుగు రోజుల్లో వచ్చేయమని చెప్పి పంపారు.

నాలుగు లేదు, వారం రోజులైనా పిల్లలు రాకపోయేసరికి సత్యవతమ్మ కంగారు పడసాగింది.

సుందరం గారు మాత్రం

"వెళ్ళింది మీ అమ్మావాళ్ళింటికే కదా,, వస్తారులే.. అంత కంగారెందుకు?" అన్నారు.

పదో రోజున భవాని ఒక్కర్తే రిక్షాలో దిగింది.

"అదేవిటే! చెల్లాయేది? ఏమయింది?" అని అడిగింది సత్యవతి. "దానిగురించి నాకు చెప్పకు.. మనిషన్నాకా, దానికైనా తెలియాలి.. లేదా ఒకరు చెప్తే వినాలి. రెండూ లేకపోతే కష్టం. ఇంకెప్పుడూ నన్ను దానితో ఎక్కడికీ వెళ్ళమనకు చిన్నపిల్లా ఏమన్నానా? పదిహేనేళ్ళొచ్చాయి ఇంకా బుర్రా, బుద్ధీ లేకుండా ప్రవర్తిస్తుంది" అంది కోపంగా..

" అది సరేలే.. అసలేమయింది? ముందీ సంగతి చెప్పు " అంది ఆ విడ.

" అది ఎప్పుడొస్తుందో చెప్పలేనమ్మా.. ఎందుకంటే దానికే తెలీదు.. " అని అసలు విషయం చెప్పేసరికి నవ్వాలో , ఏడవాలో తెలియనట్టుగా ఉండిపోయారు భార్యాభర్తలిద్దరూ..

" వెళ్ళగానె పెద్ద ఆరిందాలా.. తాతయ్యా.. మా అమ్మ నాలుగంటే నాలుగే రోజులుండి రమ్మనమని చెప్పింది.. అంతకన్నా ఎక్కువ ఉండమనకండి.. మీ ఇంటికి ఎవరు వచ్చినా సరే ఏదో ఒక వంక పెట్టి ఉంచేస్తారని చెప్పింది అమ్మ అంది. నేను తప్పు.. అలా అనకూడదన్నా సరే. "

దానికాయన నవ్వుతూ.. "అలాగేనమ్మా, ఇది మీ తాతగారిల్లు.. మీ ఇష్టం వచ్చినప్పుడు రావచ్చు. వెళ్ళవచ్చు.. మీ అమ్మ అలాగే అంటుంది.. మీరిద్దరూ కనబడకపోతే బెంగ దానికి" అన్నారు.

"ఇక్కడ మీ మామయ్యల పిల్లలతో చేరి దాన్ని మర్చిపోతారని" అని అమ్మమ్మకూడా వంత పాడింది

రోజుల లెక్క వేళ్ళ మీద పెట్టుకుని "నాలుగు రోజులయ్యాకా తాతయ్యా, మేము రేపు వెళ్ళిపోతాం. రేపే ఐదో రోజు కదా!.. " అంది..

దానికాయన నవ్వుతూ, "అలాగే ! అదే మాట ఎక్కడైనా రాసుకుందాం, నువ్వు మర్చిపోవనుకో, పనుల్లో పడి నేను బండి కట్టించడం మర్చిపోతేనో? బాగా ఎదురుకుండా ఉండి కనిపిస్తుంది ఈ గోడ మీద రాయి.. మా ప్రయాణం రేపు అని. రేపు పొద్దున్నే నిద్రలేవగానే నేను దాన్ని చూసి బండికి పొలానికి కబురు పెడతాను సరేనా? "అన్నారు.

అలా అంటే ఈ పిచ్చిమొద్దు నిజమే కాబోసుననుకుని అలాగే రాసింది.. ఇంక అక్కడనించీ చూడాలి దాన్ని, తాతయ్యని..

రోజు పొద్దున్నే ఇది నిద్ర లేవడం... తాతయ్య దగ్గరకి వెళ్ళి ఇవ్వాళే కదా మేం వెళ్ళిపోవడం అని అడిగితే.. తాతయ్య. గోడ మీద ఏముందో చూపించడం.. ఓహో.. నిజమే! రేపు కదా.. అని 'మా ప్రయాణం రేపు' అని తను రాసుకున్న వాక్యం చదివేసుకుని.. 'అమ్మమ్మా మేము వెళ్ళడం రేపు' అని అమ్మమ్మతోనో, బాలత్తా, ఇవ్వాళకాదు మేం వెళ్ళడం. నేనే మర్చిపోయాను అని బాలత్త తోనో చెప్పడం.. నేనేదైనా చెప్పబోతే ఖయ్యిమంటూ నామీదకి లేవడం.

ఇదే గతవారం రోజులుగా సాగుతోంది. అందరూ మమ్మల్ని చూసి నవ్వడమే.. 'వెళ్ళిపోదామే 'అంటే 'పెద్దవాళ్ళ మాట తప్పకూడదని అమ్మ చెప్పలేదూ.. అయినా అబద్దం ఆడకూడదు. '.. అని నాకే నీతులు చెప్పడం. ఇంక నాకు ఒళ్ళు మండి చెప్పకుండా వచ్చేసాను.. అంది కోపంగా..

" అయ్యో, అదా విషయం.. అదోదో అమాయకురాలు. నీ మతేమయిందే? తాతకీ, అమ్మమ్మకీ చెప్పి రావద్దూ? ముందు అక్కడేం కంగారు పడుతున్నారో? " అని మనిషినీ, రిక్షాని పంపి ప్రసూనని తీసుకుని వచ్చారు.

ప్రసూన వచ్చాకా, చివాట్లేసింది సత్యవతమ్మ. "ఇంత వెర్రిదానివేమిటే? " అని..

"అమ్మా.. నన్నేమీ అనకు.. తాతయ్యా, నేను కలిసి చేసుకున్న ఒప్పందం అది. మా ప్రయాణం రేపు అని రాసుకోమన్నాడు.. నేను రాసుకున్నాను. అది రోజూ రేపే చూపిస్తే తప్పు నాదీ కాదు, తాతయ్యదీ కాదు" అంది కోపంగా.

"అది ఎప్పుడైనా ఈ రోజే అని చూపించకపోతుందా, ఆ రోజు బయలుదేరవచ్చు కదా అని ఎదురుచూస్తున్నాను.. ఇంతట్లోకి ఈవిడగారేమో పెద్ద పనున్నట్టు పరిగెత్తుకు వచ్చేసింది.. "అని ఎదురు భవాని మీద ఎగిరింది.

"చూసావా అమ్మా, నువ్వు చెప్పిందే నిజం. ఇది నిజంగా అజ్ఞాన ప్రసూన. " అంది.

" నువ్వే బండ భవానివి.. " అని గడ్డిమేటు పెరట్లోకి పరిగెత్తింది

' ఇలాంటి పిల్ల రేపొద్దున్న పెద్దదయ్యాకా ఎలా ఉంటుందో? ఏం చేస్తుందో? అసలు దీన్నెవరైనా చేసుకుంటారా? డబ్బూ, రూపమూ ఉంటే చాలా? బుద్ధి ఉండద్దూ.. ఇప్పటికే దీని అమాయకత్వం గురించి అందరికీ తెలిసే పోయింది ' అని సత్యవతమ్మకి భయం పట్టుకుంది.

' ఎప్పుడూ ఇంటి చుట్టుపక్కల పిల్లలని చేర్చి ఆటలాడడం తప్ప కుదురుగా కూర్చోదు. ఎవరేం చెప్పినా గుడ్డిగా నమ్మేసి దానివెనక పరుగులు తీయడం. క్రిందటేడాదీ ఇలాగే

వెన్నెల్లో వెండి పట్టీలు కాళ్ళకి కాకుండా తులసి చెట్టుకి తగిలించి రాత్రంతా దాన్నే చూస్తూ కూర్చుని మాట్లాడకుండా లక్ష్మీదేవిని స్మరిస్తే పొద్దున్నకల్లా రెండు జతలవుతాయని బళ్ళో స్నేహితురాలు చెప్పిందని రాత్రంతా మంచులో వాకిట్లో తులసమ్మ దగ్గర కూర్చుంది.

అర్ధరాత్రెప్పుడో బాత్‌రూంకి వెళదామని లేచిన సత్యవతికి బార్లా తెరిచిన తలుపూ, వెనక వాకిట్లో పిల్లా కనిపించేసరికి కంగారు వేసింది. ఏవిటంటే మాట్లాడదు.. లక్ష్మీదేవి జపం చేస్తున్నాని అర్ధం వచ్చేటట్టు సైగలు. అది అర్ధం కాలేదు సత్యవతమ్మకి.

ఇంక తప్పక భవానిని లేపి అడిగితే.. "సాయంత్రం నాతో ఇలా అంది కానీ నిజంగా చేస్తుందని అనుకోలేదమ్మా" అని చావు కబురు చల్లగా చెప్పింది.

"నీ వెండి పట్టాలు మండినట్టే ఉన్నాయి. నీకు కావాలంటే ఇంకో జత చేయిస్తాను.. ముందీ వెర్రి మొర్రి వేషాలు మాను. " అని లేపి రెండు తగిలించి మరీ తీసుకొచ్చింది ప్రసూనని. .

"నువ్వైనా చెప్పద్దుటే? ఈ పిచ్చిదానికి.. " అంది భవానితో

"ఇది ఇలా అర్జంట్‌గా చేస్తుందని నాకేం తెలుసమ్మా? "అని భవాని అడిగింది.

"ఒక్కరాత్రి పడుకోపోతే ఏమయిపోతాను? శివరాత్రికి జాగారం చెయ్యడం లేదూ? వస్తే వస్తాయి లేకపోతే రేపు నిద్ర పోవచ్చు బడి మానేసి అనుకున్నాను.. అయినా నేను పట్టీలు కావలనుకున్నది నాకు కాదు.. అక్కకి దానిదే విరిగిపోయింది కదా నిన్న స్కూల్‌నించి వస్తుంటే. " అంది అమాయకంగా. కోపంలోంచి తన్నుకుని వచ్చింది నవ్వు సత్యవతికి..

ఇలాంటివి ఎన్నో సంఘటనలతో పదిహేడేళ్ళు వచ్చాయి ప్రసూనకి.. తెల్లగా బొమ్మలా ఉంటుంది.. ఏ సినిమా పాట విన్నా రెండోసారి వినక్కరలేకుండా పాడేస్తుంది. అది ఎంత కష్టమైన పాటయినా సరే. వంట కూడా బాగానే చేస్తుంది.

మరుసటి సంవత్సరం హైదరాబాదులో ఉండే రాఘవులుగారి అబ్బాయి రమణారావుతో భవాని పెళ్ళి కుదిరింది. వేసవి కాలంలో పెళ్ళి. ఇంట్లో చెప్పలేనంత హడావిడి. బట్టలూ, నగలూ కొనడమూ, ఇంటికివెల్లలు వేయించడమూ, గడపకు రంగులు వెయ్యడమూ ఇలా ఒకదాని తర్వాత ఒకటి..ఊపిరి సలపనంతగా పనులు.

మధుపర్కాలు, వెండి సామానులు లాంటి ముఖ్యమైన వస్తువులు కొనడానికి అమలాపురం వెళ్ళినపుడు కనిపించాడు శ్రీధర్.

"అత్తా.. " అని పలకరించాడు.

శ్రీధర్ సత్యవతమ్మగారి పెద్దవదిన అక్క కొడుకు. తండ్రి లేడు.. ఢిల్లీలో ఉంటారు. ఇంజనీరింగ్ పాస్ అయ్యి ఈ మధ్యనే ఉద్యోగం చేస్తున్నాడు.

" అమ్మా, నేనూ ఇప్పుడే దొడ్డమ్మగారింటికి వెళదామని ఇక్కడ బస్ దిగాం " అన్నాడు.

గబ గబా వెళ్ళి వాళ్ళమ్మ అనసూయని పలకరించింది పలకరించింది..

" ముందు మా ఇంటికే.. ఇన్నాళ్ళకి కనిపించారు. రెండు రోజులుండి వెళుదురు గాని. వదినకి నేను కబురు పెడతాను " అంది.

" పెళ్ళివరకూ ఉంటాము కదా, అప్పుడు వస్తామన్నా " వినకుండా ఇద్దరినీ బండి ఎక్కించారు.

"బావున్నారా? నేను గుర్తు ఉన్నానా? " అని పలకరించాడు. భవానిని, ప్రసూనని.

వాళ్ళు తాతగారింటికి వెళ్ళినప్పుడు అతను అక్కడే ఉన్నాడు.

" మూడేళ్ళకే మర్చిపోతామా? అప్పుడు నన్ను చూసి ఎంత నవ్వావు" అంది ప్రసూన ఉడుక్కున్నట్టుగా..

" అప్పుడే కాదు ఇప్పుడూ నవ్వే వస్తుంది నాకు ఆ విషయం తలుచుకుంటే " అన్నాడు చిన్నగా నవ్వుతూ.. ఊరుకోమని భవాని మోచేత్తో పొడిచింది.

అతిథి సత్కారలయ్యాక అడిగింది.. సత్యవతమ్మ..

" మీ తమ్ముడి కూతురిని మీ వాడికి చేసుకుందామనుకున్నారు కదా,, ముహూర్తాల మాటేమైనా అనుకున్నారా? "..

సన్నగా నవ్వింది శ్రీధర్ వాళ్ళ అమ్మ అనసూయ. ఇంకా లేదేమో అనుకుని వదిలేసింది ఆ మాట.

రాత్రి రెండు కూరలూ, పప్పూ, పిండివంటలతో భోజనం పెట్టింది ఆవిడ. రాక రాక వచ్చారు అంటూ. కాబోయే పెళ్ళికూతురని భవానిని పనులేమీ చెయ్యనివ్వడం లేదు.. అందుకని ప్రసూనే గబగబా అమ్మ వెనకే తిరిగి అన్నీ అమర్చింది.

" మీ రెండో అమ్మాయి చక్కగా ఉంది' అంది అనసూయ.

నిట్టూర్పు కూడిన చిన్న నవ్వు నవ్వింది. సత్యవతి.

"చక్కదనానికే అన్ని చక్కబడిపోతే ఇంక దిగులేముంది వదినా? దీనంత అమాయకురాలు లేదనుకో? ఏం చెప్పను.. "అంది దిగులుగా.

ఏం పరవాలేదు.. "మీరేమీ బెంగ పెట్టుకోకండి.. మీ మంచితనమే మీకు తోడు "అందావిడ.

మర్నాడు పొద్దున్నే కాఫీల వేళ అంది అనసూయ..

"వదినా ఇప్పుడు మంచి వేళ.. రాహుకాలం, వర్జ్యమూ ఏమీ లేవు.. అన్నగారూ, మీరు ఇక్కడే ఉన్నారు కనక ఒక్క మాట చెబుతున్నాను.. మీరొప్పుకుంటే ప్రసూనని నా కోడలుగా చేసుకోవాలని ఉంది" అంది ఒక్కసారిగా.

పన్నీరు జల్లు అమాంతం మీద కురిసినట్టు నిలబడి పోయారు.. ఇద్దరూ.

ముందు సుందరం తేరుకుని.. "అదేవిటమ్మా? అయిన సంబంధం ఉంది అనుకుంటున్నారు కదా? " అన్నాడు.

"లేదన్నయ్యా, మా అన్న కూతురు శ్యామలంటే శ్రీధర్‌కి ఇష్టం లేదు.. ఆ మాట చెప్పామనే వాళ్ళకి ఇప్పుడు మేమంటే కోపంగా ఉంది కూడా. అన్నా వదినా కదా, ఎంతో కాలం ఉండకపోవచ్చు "అంది నవ్వుతూ.

అయినా సరే.. "శ్రీధర్ ఎక్కడా? మా పిల్లెక్కడా "అంది సత్యవతి..

"ఎక్కడా? అంటే ఏం చెప్పను.. ఎక్కడ నిలబెడితే అక్కడే సూత్రధారణ జరిగేటప్పుడు పక్కపక్కనా, తలంబ్రాలవేళ ఎదురెదురుగానూ 'అంది నవ్వుతూ..

"అసలు శ్రీధర్‌ని అడిగారా?" అన్నాడు సుందరం అనుమానంగా.

" ఇది నా నిర్ణయమే మావయ్యా? నేనడగమంటేనే అమ్మ అడిగింది చిన్నప్పటినించీ ప్రసూన తెలుసు. అందరిలాగే నేనూ తన అమాయకత్వాన్ని చూసి నవ్వాను, కొంచం పెద్ద అయ్యాకా జాలి పడ్డాను.. కానీ మనసు పడేలా చేసింది మాత్రం మూడేళ్ళ క్రితం కలిసినప్పుడే

తను ఉన్న పదిహేనురోజుల్లో ఒకసారి వాళ్ళ అమ్మమ్మగారు పనిపిల్లని తోడు తీసుకుని రెండు వీధుల అవతల ఉన్న గుడికి వెళ్ళి వస్తూ ఉంటే వర్షం వచ్చి తడిసిపోయారు. పెద్దావిడకి ఇంటికి రాగానే జ్వరం వచ్చిమూడు రోజులు మంచం దిగలేదు.. ఇంట్లో అందరూ ఆవిడ గురించే ఆందోళన పడ్డారు. డాక్టర్‌ని పిలిచారు. దగ్గరుండి మందులిచ్చారు, పత్యం అంటూ జావా, బ్రెడ్డూ పెట్టారు. ఇంట్లో అందరితో పాటు తన అమ్మమ్మగారికోసం ప్రసూన కంగారు పడింది. ఆవిడతో పాటు వర్షంలో తడిసింది కదా పనిపిల్లకి కూడా జ్వరం వచ్చి ఉంటుంది అని , ఆ పిల్లకి ఒక టాబ్లెట్ కావలసి రావచ్చు అన్న ఊహ ఇంట్లో అంతమందిలోనూ ఒక్క ప్రసూనకే వచ్చింది.

అమ్మమ్మకిచ్చినప్పుడల్లా పనిపిల్ల చంద్రికి కూడా మందు బిళ్ళ ఇచ్చేది, తనకీ జ్వరం తగ్గేదాకా.. అలాంటమ్మాయా, అమాయకురాలు? అని మొదటి సారి అనిపించింది.

"మనుషులందరూ మంచిగా ఉంటారు, నిజమే చెపుతారు అనుకోవడం అమాయకత్వమే అయితే ఆ అమాయకత్వం నాకిష్టం. పక్కవారి బాధనీ, దిగుల్నీ చూసి స్పందించే గుణం అమాయకత్వమే అయితే ఆ అమాయకత్వాన్ని చూస్తే నాకెంతో ముచ్చట. పైకి ఒకటి మాట్లాడుతూ వెనక మరొకటి లోచించే అతి తెలివి కన్నా అందమైన , ముగ్ధమైన అమాయకత్వమే నాకిష్టం.. అందుకే ప్రసూనంటే నాకిష్టం.. " అన్నాడు. ప్రసూన అజ్ఞాన ప్రసూన కాదత్తయ్యా, సుజ్ఞాన ప్రసూనమే. " అన్నాడు.

శుభం.. వీలుంటే వచ్చే నెలే రెండు పెళ్ళిళ్ళూ జరిపించేస్తే సరి అనుకున్నారు. అలా మాఘమాసంలో అనుకోకుండా అక్కతో పాటు పెళ్ళికూతురయింది ప్రసూన.

***

Click here to share your comments on this article